క్లుప్తంగా

16న జన్మాష్టమి వేడుకలు



అడ్డాకుల: దేవుడే అవతరించి ఒక మనిషిగా జన్మిస్తే ఆయనను భగవంతుడు అంటారని, అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడని, ఆయనను మాత్రమే అందరు దైవంగా గుర్తించి ఊరిలోని వారందరికీ తెలిసేలా ఊరేగింపు చేయాలని త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి, ఇందుజ్ఞాన వేదిక మద్దిగట్ల కమిటీ అధ్యక్షుడు రాఘవేంద్ర ఆచారి అన్నారు. మండలంలోని చౌడాయపల్లిలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి, ఇందుజ్ఞాన వేదిక మద్దిగట్ల కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై ప్రచారం నిర్వహించారు. ఆగస్టు 16న శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగను అందరు కలిసి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రవి, మనోహర్, రమేష్, మహేష్, సుదర్శన్, శివలీల, బాలరాజు, తిరుపతి, మంజుల, సబిత, గౌరి, ఇంద్రజ పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

చిన్నచింతకుంట: కొత్త పట్టదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజేష్‌కన్న ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 5వ తేదీవరకు కొత్తగా పట్టా పాసు పుస్తకాలు పొందిన రైతులు మాత్రమే చేసుకోవాలని సూచించారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సుగల రైతులు అర్హులని పేర్కొన్నారు. రైతు పట్టాదారు పాసుబుక్కు, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ కార్డుల జిరాక్స్‌తో మండల వ్యవసాయ కార్యాలయంలో సంబధిత ఏఈఓలను సంప్రదించాలన్నారు.

కారు ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

మిడ్జిల్: మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయ స్వామి సమీపంలో ఆదివారం ఉదయం వ్యవసాయ కూలీ పనులకు వెళ్తున్న మిడ్జిల్‌కు చెందిన సొట అంజమ్మను వెనుకవైపు నుంచి కారు ఢీకొట్టింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో 108లో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ఆమెకు రెండు కాళ్లు విరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. మహిళను ఢీకొట్టిన కారు పరారు కావడంతో గ్రామస్తులు వెంబడించి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

మైసమ్మ చెంత జనజాతర



నవాబుపేట: మైసమ్మ దేవత నామస్మరణతో అడవి మొత్తం మార్మోగింది. ఆదివారం మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ దేవాలయంలో జనం తండోపతండాలుగా వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం పైగా ఆషాఢమాసం నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. దీంతో అడవిలో చెట్ల కింద జనం జాతరలా కనిపించారు.

సొంత డబ్బులతో పింఛన్ల పంపిణీ

నవాబుపేట: వృద్ధులకు, వికలాంగులకు సొంత డబ్బులతో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి ఆదివారం మండల కేంద్రంలో 137 మందికి పింఛన్లు అందజేశారు. గత పది నెలలుగా అందిస్తున్న పింఛన్లు మొదట్లో 92 మందికి అందిస్తుండగా, తాజాగా 137కు చేరింది. ప్రభుత్వం పథకాలను పోలిన విధంగా వృద్ధులకు, వికలాంగులకు సొంత డబ్బులతో పింఛన్లు అందించడంతో మండలంలో పలువురు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో వ్యాపారసంఘం మండల అధ్యక్షుడు సుధాకర్‌చారి, పుట్టి ఆంజనేయులు, నిరంజన్, రమేష్, మహేష్, తదితరులు ఉన్నారు.

పట్టణంలో విస్తృత తనిఖీలు



మహబూబ్‌నగర్ క్రైం: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం డాగ్‌స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీ నిర్వహించారు. పట్టణంలో క్లాక్‌టవర్, అశోకుల చౌరస్తా, రాంమందిర్ చౌరస్తా, తూర్పు కమాన్, ట్యాంక్‌బండ్ ఏరియాలో ఉన్న హోటళ్లు, దుకాణాలు, పాన్ దుకాణాలలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ అప్పయ్య మాట్లాడుతూ దుకాణాల నిర్వహకులు భద్రత నియమాలు పాటించి, శాంతిభద్రతలకు సహకరించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో బైక్‌లను పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ ర్యాలీలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ శీనయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కేఎల్ఐ.. రికార్డు బ్రేక్!

ఈ ఏడాది ఇప్పటికే 4 టీఎంసీలు పంపింగ్



కేఎల్ఐ ఎత్తిపోతల పథకం

రెగ్యులర్‌గా పంపింగ్..

వర్షాకాలంలో మినహాయిస్తే మిగతా రోజుల్లో ఎల్లూరు పంప్‌హౌజ్ లోని మూడు మోటార్ల ద్వారా రెగ్యులర్‌గా నీటిని పంపింగ్ చేస్తు న్నాం. సాగునీటితో పాటు, మిషన్ భగీరథకు కూడా నీటిని ఎత్తిపోస్తున్నాం. దీంతో మోటార్లపై భారం పడుతోంది. అయినా తప్పడం లేదు. పాలమూరు ప్రాజెక్టు ద్వారా ఎత్తిపో తలు ప్రారంభమైతే కేఎల్ఐపై భారం తగ్గ తుంది. ఈ ఏడాది జూన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 4 టీఎంసీల నీటిని ఎత్తిపోశాం. గతేడాది 50 టీఎంసీల నీటిని ఎత్తిపోశాం.

– లోకిలాల్ నాయక్,
డీఈ, పంపుహౌజ్ నిర్వహణ విభాగం

- గత సీజన్‌లో 50 టీఎంసీల నీటి ఎత్తిపోతలు
- మూడు మోటార్లతోనే కొనసాగుతున్న లిఫ్టింగ్
- భారం పడుతున్నా.. తప్పడం లేదంటున్న అధికారులు

కొల్లాపూర్: జిల్లా వరప్రదాయిని కేఎల్ఐ ప్రాజెక్టు నీటి ఎత్తిపోతల్లో రికార్డు సృష్టిస్తోంది. కృష్ణానదికి వరద ప్రారంభమైన కొన్ని రోజుల్లోనే 4 టీఎంసీల నీటిని ఎత్తిపోసి గత రికార్డుకు బ్రేక్ వేసింది. 2011లో కేఎల్ఐ ద్వారా ఎత్తిపోతలు ప్రారంభం కాగా.. నాటి నుంచి అవిశ్రాంతంగా మోటార్లు పనిచేస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం ప్రాజెక్టు మొదటి పంపుహౌజ్‌లో రెండు మోటార్లు పాడయ్యాయి. మిగిలిన మూడు మోటార్లతోనే నీటిని ఎత్తిపోస్తూ ప్రాజెక్టు అధికారులు రికార్డు సృష్టిస్తున్నారు.

పనితీరు ఇలా..

కేఎల్ఐ పరిధిలో ఎల్లూరు, జొన్నలబొగుడ, గుడిపల్లి గట్టు పంప్‌హౌజ్‌లు ఉన్నాయి. ఒక్కో పంపుహౌజ్‌లో 5 మోటార్ల చొప్పున ఏర్పాటుచేశారు. వీటిలో 4 మోటార్లు రెగ్యులర్ పంపింగ్ కోసం, ఒక మోటార్ స్పేర్‌లో ఉంచేందుకు నిర్ణయించారు. 30 మెగావాట్ల సామర్థ్యం గల ఒక్కో మోటార్ ద్వారా రోజూ 800 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తారు. కేఎల్ఐ ద్వారా కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని ఆయకట్టు భూములకు సాగునీరు అందుతోంది.

మిషన్ భగీరథకు సైతం..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాలకు తాగునీరు అందించేందుకు ఏర్పాటుచేసిన మిషన్ భగీరథ పథకానికి కూడా కేఎల్ఐ ద్వారానే నీటి ఎత్తిపోతలు సాగుతున్నాయి. ఎల్లూరు సమీపంలోనే మిషన్ భగీరథ స్కీం ఏర్పాటుచేశారు. ఇక్కడి నుంచే అన్ని ప్రాంతాలకు తాగునీరు సరఫరా అవుతోంది. ప్రతి సంవత్సరం మిషన్ భగీరథ కోసం 7 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నారు.

ప్రాజెక్టు ప్రారంభం నుంచి నీటి ఎత్తిపోతలు ఇలా..

సీజన్	ఎత్తిపోసిన నీరు (టీఎంసీల్లో)
2011-12	0.00864
2012-13	1.9062432
2013-14	1.351552
2014-15	1.7842464
2015-16	2.5099632
2016-17	14.01715
2017-18	27.35148
2018-19	35.97796
2019-20	49.99874
2020-21	30.29203
2021-22	31.71288
2022-23	37.50358
2023-24	30.38209
2024-25	50.72208


2025 జూన్ 1నుంచి ఇప్పటి వరకు 4 టీఎంసీలు ఎత్తిపోశారు.

ఇదీ ప్రాజెక్టు చరిత్ర..

కొల్లాపూర్ మండలం ఎల్లూరు సమీపంలోని కోతిగుండు వద్ద నుంచి కృష్ణా బ్యాక్‌వాటర్‌ను వినియోగించుకునేలా కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మించారు. 1998లో ప్రాజెక్టు నిర్మాణానికి సర్వే చేపట్టారు. 2003లో పనులు ప్రారంభమయ్యాయి. 2.50లక్షల ఎకరాల ఆయకట్టు సాగుకు 25 టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా డిజైన్ రూపొందించారు. 2005లో ఆయకట్టు విస్తీర్ణాన్ని 3.40 లక్షలకు పెంచారు. 2011లో ఈ ప్రాజెక్టు ద్వారా నీటి ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయి. ఎల్లూరు పంప్‌హౌజ్‌లోని 5 మోటార్ల ద్వారా రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోసి.. అక్కడి నుంచి సింగోటం, జొన్నలబొగుడ, గుడిపల్లి గట్టు రిజర్వాయర్లకు పంపింగ్ చేస్తున్నారు. 2016లో ప్రాజెక్టుకు 40 టీఎంసీల నీటి కేటాయింపులు జరిగాయి. దీంతో ఆయకట్టు విస్తీర్ణాన్ని 4.24 లక్షల ఎకరాలకు పెంచారు.

మోటార్లపై భారం..

ఎల్లూరు పంప్‌హౌజ్‌లో ఐదు మోటార్లకు గాను ప్రస్తుతం మూడు మోటార్లు మాత్రమే పనిచేస్తున్నాయి. 2011లో కేఎల్ఐ ద్వారా నీటి ఎత్తిపోతలు ప్రారంమైన సమయంలో ఐదు మోటార్ల ద్వారా 0.0086 టీఎంసీ నీటిని మాత్రమే ఎత్తిపోశారు. 2015 వరకు ప్రతి సంవత్సరం 2.5 టీఎంసీల లోపు మాత్రమే ఎత్తిపోతలు జరిగాయి. 2016 నుంచి నీటి పంపింగ్ శాతం భారీగా పెరుగుతూ వచ్చింది. మూడు మోటార్లతోనే రికార్డు స్థాయిలో పంపింగ్ జరుగుతోంది. సాగు, తాగునీటికి కేఎల్ఐ ప్రాజెక్టే దిక్కవడంతో మోటార్లపై పంపింగ్ భారం పెరుగుతోంది. నీటి పంపింగ్ రికార్డుస్థాయిలో జరుగుతోందని ఓవైపు ఆనందపడుతున్న అధికారులు.. మరోవైపు మోటార్లపై భారం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఎల్లూరు పంప్‌హౌజ్ నుంచి నీటి ఎత్తిపోతలు

ముఖద్వారం ప్రారంభించిన ఎంపీ



ముఖద్వారం ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ

దేవరకద్ర రూరల్: వెంకటాయపల్లికి చెందిన కందూర్ రఘుపతి సాగర్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం దేవరకద్ర నుంచి వెంకటాయపల్లికి వచ్చే మార్గంలో నిర్మించిన రంగనాయక స్వామి ముఖద్వారం (కమాన్)ను పాలమూరు ఎంపీ డీకే ఆరుణ ప్రారంభించారు. అనంతరం వెంకటాయపల్లిలోని రంగనాయక స్వామిని ఎంపీ దర్శించుకొని ప్రత్యేక పూజాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆలయ అభివృద్ధి కోసం చేసిన వినతులకు ఆమె సానుకూలంగా స్పందించారు. అంతకుముందు దేవరకద్రలో ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేశారు. పార్లమెంట్ కన్వీనర్ పవన్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి, ప్రభుసాగర్, నరసింహ, కృష్ణంరాజు, రాజు, మధు గౌడ్ పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం



నవాబుపేట: మండల కేంద్రంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిల చి త్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. జడ్చర్ల నియోజకవర్గానికి ఐఐఐటీ మంజూరు చేయించటంపై కాంగ్రెస్ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గాన్ని అనతికాలంలోనే అభివృద్ధివైపు నడిపిస్తున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, మైసమ్మ చైర్మన్ జనగ్‌మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి జహీర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాంచంద్రయ్య, వా సుయాదవ్, యువజన కాంగ్రెస్ మండల అ ధ్యక్షుడు నీలకంఠ, అజహర్, రమేష్‌గౌడ్, రా జేష్, నవాజ్‌రెడ్డి, సత్యం, నర్సింహ, శ్రీనివాస్, శ్రీహరి, ఆనంద్ పాల్గొన్నారు.

బీసీ బిల్లును ఆమోదించాలని ధర్నా



అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రం వెంటనే ఆమోదించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ బీసీల పట్ల ఆడుతున్న కపట నాటకాన్ని ప్రజలు పసిగట్టాలన్నారు. పేదల రిజర్వేషన్లకు పూర్తిగా వ్యతిరేకిస్తూ ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తుందన్నారు. బీసీలకు రిజర్వేషన్లు ఆమోదిస్తే ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ వెళ్తుందనే అబద్ధపు ప్రచారాన్ని చేస్తున్నారన్నారు.రాష్ట్రానికి చెందిన ఎంపీలు బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదింపజేసే లా కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. బీసీ ఆమోదం తెలపని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడు తామని హె చ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కురుమూర్తి, పట్టణ కార్యదర్శి చంద్రకాంత్, జిల్లా కమిటీ సభ్యులు మోహన్, దీప్లా పాల్గొన్నారు.

శివశంకర్‌కు ఘన నివాళి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): బీసీల రిజర్వేషన్ల ఆరాధ్యుడు, ఈరోజు దేశవ్యాప్తంగా బీసీలు రిజర్వేషన్ ఫలాలు అనుభవిస్తున్నా రంటే దానికి ప్రధాన కారకుడు, భారత సా మాజిక న్యాయ శిఖరం, బీసీల ముద్దుబిడ్డ పి.శివ శంకర్ అని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సాగర్ అన్నారు. బీసీ స మాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో శివశంకర్ చిత్రపటానికి వివిధ కుల సంఘాల పెద్ద లు, బీసీ విద్యార్థి సంఘం నాయకులతో కలిసి శ్రీనివాస్ సాగర్ ఘనంగా నివాళులర్పించా రు. మండల కమిషన్ రిపోర్టును సుప్రీంకోర్టులో వీగిపోకుండా అమలయ్యేలా కృషిచేసిన గొప్ప న్యాయనిపుణుడు శివ శంకర్ అని, పార్టీ ఫిరాయింపుల చట్టం ఈరోజు అమలు అవుతుందంటే అది శివశంకర్ పుణ్యమే అని శ్రీనివాస్ సాగర్ కొనియాడారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్, జాంగ్రి సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, నాయీబ్రాహ్మణ సంఘ పట్టణ అధ్యక్షుడు అశ్విని స త్యం, తెలంగాణ ఉద్యమకారుల సంఘం మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు కె.శివన్న, సత్యనారాయణ సాగర్, సుకుమార్ పాల్గొన్నారు.


క్రిస్టియన్‌కాలనీలో హైమాస్ట్ లైట్ల ప్రారంభం



క్రిస్టియన్‌కాలనీలో సీజే బెన్‌హర్‌ను అభినందిస్తున్న కాలనీవాసులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక క్రిస్టియన్‌కాలనీలోని ఎంబీ ప్రార్థన మందిరం ఆవరణలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆదివారం రాత్రి డీసీసీ మీడియా సెల్ కన్వీనర్, మాజీ కౌన్సిలర్ సీజే బెన్‌హర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరం అభివృద్ధికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. వాటి ఏర్పాటుకు సహకరించిన ముడా చైర్మన్ కె.లక్ష్మణ్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ కె.ఆనంద్‌కుమార్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు ఎస్.కె.డేవిడ్, సీజే ప్రవీణ్‌కుమార్, కేజే డానియల్, శ్యామ్, విమలాపీటర్, అరుణ, పద్మ, రోజ్‌మేరీ, ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

పస్పుల ఘాట్‌కు తాకిన వరద



మక్తల్: రెండు, మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కృష్ణా నది వరద పస్పుల ఘాట్‌ను తాకింది. ఎగువన కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర డ్యాం గేట్లు ఎత్తు నీటిని దిగువకు వదలడంతో జిల్లాలోని కృష్ణా నదికి చేరుకుంది. కృష్ణా నదిలో నీటి మట్టం పెరగడంతో పస్పుల దగ్గర ఉన్న రెండు పాయాల్లో వరద నీరు అధికంగా ప్రవహిస్తుంది. కృష్ణా నదిలో నీటి మట్టం పెరగడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

అటెన్షన్ ప్లీజ్





తవ్వారు.. వదిలేశారు!

మహమ్మదాబాద్: ఓ ప్రధాన రహదారి పక్కనే మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో మరమ్మతు కోసం తవ్వి వదిలేయడంతో ప్రయాణికులకు ఎంతో ఇబ్బంది ఏర్పడింది. మండలంలోని మొకర్లాబాద్ నుంచి గాధిర్యాల్ వెళ్లే దారిపక్కన పైపులైన్ లీకేజీ అయ్యింది. మరమ్మతు కోసం 15రోజుల క్రితం తవ్వి వదిలేయడంతో అటుగా వెళ్లే ఆరు గ్రామాల గిరిజన తండాల ప్రజలు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మరమ్మతు చేసి సమస్య తీర్చాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

శతాబ్ది ఉత్సవాలకు పూర్తి సహకారం



మాజీ మంత్రిని కలిసిన ఉత్సవ కమిటీ సభ్యులు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్న త పాఠశాల శతాబ్ది ఉత్సవాలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని మాజీ మంత్రి డా.లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం జడ్చర్లలో ఆయన నివాసంలో శతాబ్ది ఉత్సవ కమిటీ కార్యవర్గం కలుసుకుని ఉత్సవాలకు సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాల 100 ఏళ్లు పూర్తిచేసుకోవటం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. హైస్కూల్ అభివృద్ధిలో తనవంతు భాగస్వామ్యాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కృష్ణ, ప్రధాన కార్యదర్శి రమణాచార్యులు, ఉపాధ్యక్షుడు జీనురాల సత్యం, సత్యం, సయ్యద్ ఇబ్రహీం, కార్యనిర్వహణ కార్యదర్శి కంచుకోట ఆనంద్, పరమటయ్య, సంతోష్‌చారి, శ్రీహరి, మహిళా కమిటీ అ ధ్యక్షురాలు మౌనిక, ఎంఈఓ మంజులాదేవి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పి.మురళి, ఇఫ్తెకారొద్దీన్, నర్సింహయాదవ్, పర్వత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య ఉన్నారు.

పెద్దగుట్టకు పోటెత్తిన భక్తజనం



పెద్దగుట్టపై వ్రతం చేస్తున్న భక్తులు



అన్నదానం చేస్తున్న రజని సాయిచంద్

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పట్టణంలోని పెద్దగుట్టపై ఉన్న రంగనాథస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. రక్షాబంధన్‌కు వచ్చిన ఆడపడుచులు గుట్టపై స్వామి దర్శనానికి రా వటంతో పెద్దగుట్ట పరిసరాలు భక్తజనసంద్రంగా మారాయి. లక్ష్మీసమేత రంగనాథస్వామిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గుట్టపైకి వచ్చిన భక్తులకు ఆలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వరాంరెడ్డి పూర్ణకుంభస్వాగతం పలికారు. మేళతాళాలతో భక్తులకు స్వాగతం పలికి ఆలయంలో స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించారు. ఆదివారం పదివేల మందికిపైగా భక్తులు గుట్టపైకి వచ్చారంటే అతిశయోక్తి లేదు.ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలి రావటంతో గుట్టపైకి భక్తులను తరలించేందుకు ఇబ్బందిగా మారింది. కొందరు భక్తులు పాదయాత్రగా గుట్టపైకి చేరుకున్నారు. రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజని సాయిచంద్ ఆదివారం గుట్టపైకి చేరుకుని స్వామికి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి పూజలు చేశారు.

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి



కరాటే చాంపియన్‌షిప్‌ను ప్రారంభిస్తున్న ఎన్పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ క్రీడలు: ఆత్మరక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఫౌండర్ కె.వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆదివారం 4వ జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు పలు జిల్లాలకు చెందిన 150కి పైగా కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. కుమితే, కతాస్, లాంగ్‌వెపన్, షార్ట్ వెపన్, టీమ్ కతాస్ పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పతకాలు సాధించారు. కరాటే చాంపియన్‌షిప్‌ను ఎన్పీ వెంకటేశ్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఫిజికల్ ఫిట్‌నెస్‌గా ఉండాలని కోరారు. కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభచాటాలని సూచించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ జిల్లా విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి కరాటే టోర్నీలో రాణించాలని కోరారు. జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ నిర్వహించిన శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఫౌండర్ వెంకటేశ్‌ను అభినందించారు. ఆయా విభాగాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో కరాటే టోర్నీ ఆర్గనైజర్ మాస్టర్ కె.వెంకటేశ్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రతినిధి పుట్టి సురేష్‌చందర్, జిల్లా యోగా సంఘం ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు, డి.నర్సింహులు, కోటకదిర నర్సింహులు, హరి, సంపత్, శివశంకర్, మహేష్, అనిల్‌కుమార్, పలువురు కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న బీజేపీ నాయకులు

మహమ్మదాబాద్: కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసమే బీజేపీ పాదయాత్ర మొదలు పెట్టినట్లు బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి బూనేటి మారుతికిరణ్ తెలిపారు. ఆదివారం మండలంలోని నంచర్లగేట్ నుంచి నంచర్ల, గాధిర్యాల్, చౌదర్‌పల్లి, మంగంపేట్, మొకర్లాబాద్ మీదుగా మహమ్మదాబాద్ మండల కేంద్రానికి పాదయాత్ర చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో అధికారులకు, ప్రభుత్వానికి తెలిసేందుకే పాదయాత్ర చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు, ఏపీ రాములు, కేశవులు, కృష్ణ, నర్సింహ, హరికృష్ణ, అనీల్, మహిపాల్, కాశీనాథ్, కార్యకర్తలు ఉన్నారు.

సుధాకర్‌రెడ్డి సేవలు మరువలేనివి

దేవరకద్ర రూరల్: దేవరకద్ర మాజీ సర్పంచ్ కొండ సుధాకర్‌రెడ్డి పట్టణాభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదని మాజీ ఎమ్మెల్యే స్వర్ణమ్మ అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీనివాస్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలో ఆమె మాట్లాడారు. ఈ సంస్మరణ సభలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ పీఏసీఎస్ చైర్మన్‌గా, మార్కెట్ చైర్మన్‌గా, సర్పంచ్‌గా పని చేసిన సుధాకర్ రెడ్డి పార్టీలకు అతీతంగా ప్రజల కోసం పని చేశారన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.